క్లుప్తంగా

భోజనశాల నిర్మాణానికి రూ.25 వేల విరాళం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయి మందిరం ఆవరణలో నిర్మించనున్న భోజనశాల నిర్మాణానికి గురువారం ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నారాయణపురం గ్రామానికి చెందిన కంబాల గురులింగం రమావసంత దంపతులు రూ.25 వేల విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మండవ వెంకటేశ్వరరావు, కార్యదర్శి అనంతుల కృష్ణయ్య పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా శ్రీకాంత్



శ్రీకాంత్‌కు నియామకపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల సందీప్‌రెడ్డి

నేరేడుచర్ల : యూత్ కాంగ్రెస్ పార్టీ నేరేడుచర్ల పట్టణ అధ్యక్షుడిగా ఇంజమూరి శ్రీకాంత్ నియమితులయ్యారు. గురువారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల సందీప్‌రెడ్డి.. శ్రీకాంత్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ పట్టణంలో యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు తనవంతు కృషిచేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాళ్ల రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, చిన రామకృష్ణారెడ్డి, సందీప్, కృష్ణ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని గోపాలపురంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందిన చామకూరి మంగమ్మ కుటుంబానికి హుజూర్‌నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్ రూ.10వేల ఆర్థికసాయాన్ని గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ముడెం గోపిరెడ్డి, ఎంపీటీసీ చీకూరి రాజారావు, సుందరయ్య, వెంకటేశ్వర్లు, గురువయ్య, తదితరులు ఉన్నారు.

చల్లా శ్రీలతారెడ్డి పరామర్శ



సాయిప్రశాంత్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చల్లా శ్రీలతారెడ్డి

నేరేడుచర్ల : మున్సిపాలిటీ పరిధిలోని చింతబండకు చెందిన చెన్నూరి సాయి ప్రశాంత్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో గురువారం బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షురాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ చల్లా శ్రీలతారెడ్డి ప్రశాంత్ కుటుంబాన్ని పరామర్శించి ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులకు రూ. 5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆమెవెంట కౌన్సిలర్లు తాళ్లూరి సాయి, కుంకు సులోచనశ్రీను, నాయకులు సైదులు, అఫ్సర్, శ్రీకాంత్, భిక్షం, సైదా, గోపి, రాము, వెంకటేష్, మురళి తదితరులు ఉన్నారు.

నిమ్మల శ్రీను మృతి బాధాకరం



నిమ్మల శ్రీను (ఫైల్)

మోతె : మండల పరిధిలోని రావిపహాడ్ గ్రామానికి చెందిన నిమ్మల శ్రీను (52)కు జ్వరం వచ్చి అస్వస్థతకు గురై గురువారం మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మమ్మ, కొడుకు, కూతురు ఉన్నారు. కాగా నిమ్మల శ్రీను మృతదేహాన్ని సర్పంచ్ శ్యామలేటి కోటేష్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పాడపంగి యలమంచి, పలువురు నాయకులు, కార్యకర్తలు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమ్మల శ్రీను మృతి బాధాకరమన్నారు. తెలంగాణ ఉద్యమంలో నిమ్మల శ్రీను తనవంతు పోరాడారని తెలిపారు.

జూన్‌లో ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవం

గరిడేపల్లి : మండలంలోని కాలువపల్లి గ్రామంలో రూ.25 లక్షల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో శ్రీసీతారామచంద్రస్వామి, లక్ష్మణ, ఆంజనేయ, శిఖర, శ్రీషిర్డిసాయిబాబా, శ్రీకృష్ణ, దత్తాత్రేయ, గణపతి, ధ్వజస్తంభ, బొడ్రాయి విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని జూన్ నెలలో నిర్వహించాలని గురువారం ఆలయ కమిటీ సభ్యులు తీర్మానించారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. సమావేశంలో పురోహితులు ద్రోణ సుబ్రహ్మణ్యశర్మ, రాయప్రోలు శ్రీరామయ్యశర్మ, గ్రామ సర్పంచ్ సాగి నాగేశ్వర్‌రావు, ఎంపీటీసీ పి.మహాలక్ష్మీ గోవింద్, మాజీ సర్పంచ్ సూరయ్య, రామారావు, పిచ్చయ్య, నాగయ్య తదితరులున్నారు.

నిరుపయోగంగా కమ్యూనిటీ భవనాలు

- మౌలిక వసతులు కల్పించని ప్రభుత్వం
- కొన్నిచోట్ల శిథిలావస్థకు చేరిన భవనాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



నడిగూడెంలో నిరుపయోగంగా ఉన్న ఎస్సీ కమ్యూనిటీ భవనం



తెల్లబల్లి గ్రామంలో నిరుపయోగంగా ఉన్న బీసీ కమ్యూనిటీ భవనం

నడిగూడెం : మండల పరిధిలోని పలు గ్రామాలలో లక్షల రూపాయల వ్యయంతో ఎస్సీ, బీసీ కాలనీలలో నిర్మించిన కమ్యూనిటీ భవనాలు ఏళ్ల తరబడి నిరుపయోగంగా మారాయి. ఆయా కమ్యూనిటీ భవనాలలో కనీసం మౌలిక వసతులు కూడా లేకపోవడంతో అవి ఖాళీగా ఉంటున్న పరిస్థితి నెలకొంది. నడిగూడెం మండల కేంద్రంతో పాటు, చెన్నకేశ్వాపురం, వేణుగోపాలపురం, బృందావనపురం, కాగితరామచంద్రాపురం, సిరిపురం, శ్రీరంగాపురం, రత్నవరం, తెల్లబల్లి, రామాపురం గ్రామాలలోని ఎస్సీ, బీసీ కాలనీలలో 10 సంవత్సరాల కిందట లక్షల రూపాయల వ్యయంతో ప్రభుత్వం కమ్యూనిటీ భవనాలను నిర్మించింది. ఆ భవనాలలో విద్యుత్ సౌకర్యంతో పాటు ఫ్యాన్‌లు, కుర్చీలు, టేబుళ్లు, దినపత్రికలు ఏర్పాటు చేయలేదు. దీంతో ఆయా కులస్తులు అటువైపు కూడా చూడడం లేదు. అయితే కమ్యూనిటీ భవనాలను నిర్మించి వసతులు కల్పించకపోవడంతోనే అవి నిరుపయోగంగా మరుతున్నాయని ప్రజలు చెబుతున్నారు.

శిథిలావస్థలో భవనాలు..

నడిగూడెం ఎస్సీ కాలనీ, బృందావనపురం, సిరిపురం, రత్నవరం, రామాపురం గ్రామాలలో నిర్మించిన కమ్యూనిటీ భవనాలు శిథిలావస్థకు చేరాయి. గోడలు, తలుపులు దెబ్బతిన్నాయి. దీంతో ఆ భవనాలలో విషసర్పాలు సంచరిస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, కమ్యూనిటీ హాళ్లలో మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

దినపత్రికలు వేయించాలి



నడిగూడెం ఎస్సీ కాలనీలో 15 సంవత్సరాల కిందట నిర్మించిన కమ్యూనిటీ హాల్‌లో మౌలిక వసతులు లేవు. భవనం శిథిలావస్థకు చేరింది. సంబంధిత అధికారులు స్పందించాలి. మౌలిక వసతులు కల్పించి, నిత్యం దినపత్రికలు వేయించాలి.

– ఎల్.అగష్టు, నడిగూడెం

మరమ్మతులు చేయించాలి



మా గ్రామంలోని ఎస్సీ కాలనీలో 10 సంవత్సరాల కిందట కమ్యూనిటీ భవనం నిర్మించారు. ఇంకా పలు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆ కమ్యూనిటీ భవనంలో మరమ్మతులు చేయించి, ఉపయోగంలోకి తీసుకరావాలి.

– పేరెల్లి కోటి, చెన్నకేశ్వాపురం

బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించాలి

- ఆర్డీఓ వెంకారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకారెడ్డి

హుజూర్‌నగర్ : అన్ని రాజకీయ పార్టీల వారు తమ పార్టీల తరఫున బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలని ఆర్డీఓ వెంకారెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్నికల జాబితా సరిచూసుకునేందుకు ఇప్పటి నుంచి ప్రతి వారం రాజకీయ పార్టీల వారితో సమావేశం ఉంటుందన్నారు. ఎలక్షన్ కమిషన్ అందించే సమాచారాన్ని ప్రతి వారం రాజకీయ పార్టీలకు తెలియజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో తాహసీల్దార్ జయశ్రీ, డిప్యూటీ తాహసీల్దార్ కమలాకర్, కాంగ్రెస్ నాయకులు కస్తాల శ్రవణ్, గోపి, గిరీష్, కుక్కడపు మహేష్,, బాలకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు సోమగాని ప్రదీప్, మీసాల కిరణ్‌కుమార్, సాయి, సీపీఐ నాయకులు యల్లావుల రాములు, సీపీఎం నాయకులు హుస్సేన్, జనసేన నాయకులు హసన్ మియా, సైదులు తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'కు విశేష స్పందన

- డిప్యూటీ డీఎంహెచ్ఓ నిరంజన్



హుజూర్‌నగర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ నిరంజన్



రత్నవరంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ జ్యోతి

హుజూర్‌నగర్ : కంటి వెలుగు పథకానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని డిప్యూటీ డీఎంహెచ్ఓ నిరంజన్ అన్నారు. పట్టణంలోని వీవీఎం హైస్కూల్‌లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరం వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమానికి పల్లె, పట్టణాల్లో ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ గజగంటి ప్రభాకర్ సబ్ యూనిట్ అధికారి అంజయ్య, ఆప్తోమెట్రిక్ శ్రీనివాస్, క్యాంప్ సూపర్‌వైజర్లు రామకృష్ణ, వి.శ్రీనివాస్, లలిత, పావని, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' దేశానికే ఆదర్శం

నడిగూడెం : తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న కంటి వెలుగు పథకం దేశానికే ఆదర్శమని ఎంపీపీ యాతాకుల జ్యోతి అన్నారు. గురువారం మండల పరిధిలోని రత్నవరంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కంటి వెలుగు శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పగడాల పద్మ, ఎంపీఓ ఎర్ర లింగారెడ్డి, డాక్టర్ అనిత, ఏఎన్ఎం జ్యోతి, పగడాల ప్రభాకర్‌రెడ్డి, సోమ వీరయ్య, పోలంపల్లి వెంకటేశ్వర్లు, కన్నెబోయిన రామారావు, జొన్నలగడ్డ వీర గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

పీఎం శ్రీ పథకానికి ఆదర్శ పాఠశాల ఎంపిక



మఠంపల్లిలోని ఆదర్శ పాఠశాల

మఠంపల్లి : మౌలిక వసతులు కల్పించి సాంకేతిక సొబగులతో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకానికి మఠంపల్లిలోని ఆదర్శ పాఠశాల (మోడల్‌స్కూల్) ఎంపికైంది. ఈ సందర్భంగా గురువారం పాఠశాల ప్రిన్సిపాల్ సాయిఈశ్వరి స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఈ పథకానికి తెలంగాణలో 543 పాఠశాలలు ఎంపిక కాగా సూర్యాపేట జిల్లాలో 12 పాఠశాలలు ఎంపికయ్యాయని తెలిపారు. మఠంపల్లి ఆదర్శ పాఠశాల కూడా ఎంపికకావడంతో ఆనందంగా ఉందన్నారు. ఈ పథకం కింద పాఠశాలలో సౌర విద్యుత్ ఏర్పాటు, కాయగూరల తోట, శుద్ధ జలం, ఐసీటీ, క్రీడా ప్రాంగణం, అంతర్జాల సదుపాయం, డిజిటల్ గ్రంథాలయం, వృత్తి విద్యా కోర్సులు మొదలగునవి సమకూరుతాయని తెలిపారు. అంతేగాక ఎన్ఈపీ -2020 పథకాన్ని అమలు చేసే పాఠశాలలుగా తీర్చిదిద్దబడనున్నాయని దీంతో మండలంలోని విద్యార్థులకు ఎంతో మేలు జరుగనుందన్నారు. సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ పండుగ



బోనాలతో ప్రదర్శనగా ఆలయానికి వెళ్తున్న మహిళలు

చిలుకూరు : కొత్త చిలుకూరులో గురువారం ముత్యాలమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా కొత్త చిలుకూరులో నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ దేవాలయం, బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం వచ్చే నెల 7న ఉన్నందున ఆచారం ప్రకారం పాత ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన



జెడ్పీ ఉన్నత పాఠశాలలో మన ఊరు- మన బడి పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్, నాయకులు

చిలుకూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మన ఊరు- మన బడి పథకంలో భాగంగా కోటి రూపాయలతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు గురువారం సర్పంచ్ కొడారు బాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని తెలిపారు. పనులు నాణ్యవంతంగా, సకాలంలో పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దొడ్డా నారాయణరావు, ఎంపీటీసీలు బెల్లంకొండ రమణ నాగయ్య, వడ్డేపల్లి కళ్యాణ కోటేష్, సొసైటీ చైర్మన్ అలసకాని జనార్దన్, డీఎల్‌డీఏ డైరెక్టర్ కస్తూరి నర్సయ్య, వార్డు సభ్యులు ముక్కా లక్ష్మీనారాయణ, కొల్లు సత్యనారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ రఫీ, పాఠశాల హెచ్ఎమ్ కరుణాకర్‌రెడ్డి, కాంట్రాక్టర్ నరేందర్, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో టిప్పర్ దగ్ధం

కోదాడ రూరల్ : షార్ట్ సర్క్యూట్‌తో టిప్పర్ దగ్ధమైంది. ఈ ఘటన కోదాడ పట్టణ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని గుడిబండ రోడ్డులో ప్రైవేట్ వ్యక్తులు టిప్పర్‌తో మట్టితోలకం పనులు నిర్వహిస్తున్నారు. మట్టిపోసేందుకు టిప్పర్ హైడ్రాలిక్‌ను పైకి ఎత్తడంతో పైన విద్యుత్ తీగలు తగలడంతో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు అంటుకున్నాయి. అప్రమత్తమైన డ్రైవర్ కిందికి దూకడంతో ప్రాణాపాయం తప్పింది. మంటలకు టిప్పర్ కిందభాగం పాక్షికంగా దగ్ధమైంది. స్థానికులు గమనించి వెంటనే మంటలను ఆర్పివేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



హుజూర్‌నగర్: సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న పట్టణ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి



మఠంపల్లి : సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న సర్పంచ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు

హుజూర్‌నగర్ : సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వివిధ వార్డులలోని 15 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.6.46 లక్షల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం వారి ఇళ్లకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి భరోసానిచ్చే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ నిర్విరామంగా సాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి అమర్‌గౌడ్, కౌన్సిలర్లు ఫణికుమారి రాంరెడ్డి, ఎం.రామ్ గోపి, వి.నాగేశ్వరరావు, నాయకులు కిరణ్‌కుమార్, ప్రదీప్‌గౌడ్, శరత్‌కుమార్, చంద్రమౌళి, అనిత రామకృష్ణ, వీరయ్య, గురవయ్య, యువజన, మహిళా నాయకులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకుంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వం

మఠంపల్లి : పేదలను బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని రఘునాథపాలెం సర్పంచ్ పఠాన్‌జానిబీ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య అన్నారు. రఘునాథపాలెంలో రూ.3 లక్షల 85వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను 17 మంది లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మజీదు కమిటీ అధ్యక్షుడు హఫీజ్‌ఖాన్, ఉపసర్పంచ్ శ్రీనివాసరెడ్డి, ఫకీర్‌అహ్మద్, ఆదాం, పందిరి ప్రతాపరెడ్డి, నరసింహారావు, వెంకటేశ్వరరావు, సుభానీ, కరీం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ గుండా ఫణి రాంరెడ్డి

హుజూర్‌నగర్ : పట్టణంలో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని కౌన్సిలర్ గుండా ఫణి రాంరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అమరనాథ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని రామాలయం బజార్‌లో మున్సిపల్ నిధులు రూ.2 లక్షలతో నూతనంగా నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు పనులను వారు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డికే సాధ్యమని అన్నారు. గతంలో కన్నా ప్రస్తుత ఎమ్మెల్యే హయాంలోనే ఎక్కువ అభివృద్ధి జరుగుతుందని వారు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పి.వెంకటరెడ్డి, పురుషోత్తంరెడ్డి, డి.రామ్‌రెడ్డి, బి.కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.600 కూలి చెల్లించాలని నిరసన



నిరసన తెలుపుతున్న బాదె నర్సయ్య, ఉపాధి హామీ కూలీలు

గరిడేపల్లి : ఉపాధి హామీ పథకం పని చేస్తున్న కూలీలకు రోజుకు రూ. 600 కూలి చెల్లించాలని ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి బాదే నర్సయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి కూలి పెంచాలని గురువారం మండలంలోని కీతవారిగూడెంలో ఉపాధి హామీ కూలీలతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలు చాలీచాలని కూలితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేలకు వేతనాలు పెరుగుతున్నా వివిధ రంగాల్లో పని చేస్తున్న అసంఘటిత రంగ కార్మికులకు మాత్రం పనికి సమాన కూలి ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నాగేశ్వర్‌రావు, ఆదేమ్మ, సైదమ్మ తదితరులు ఉన్నారు.

కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



పాలకవీడు : సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి అనంతప్రకాష్



కోదాడరూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న యాతాకుల మధుబాబు



నేరేడుచర్ల : భవన నిర్మాణ కార్మికులతో మాట్లాడుతున్న పారేపల్లి శేఖర్‌రావు

పాలకవీడు : మండల కేంద్రంలో నిర్వహించబోయే ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే వేడుకలను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి అనంతప్రకాష్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మే డే వేడుకలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంఘటిత కార్మికులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ పగడాల మట్టేష్, నాయకులు ఏసురత్నం, వీరభద్రం, పురుషోత్తంరెడ్డి, మల్లారెడ్డి, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కోదాడరూరల్ : మే 1న నిర్వహించనున్న మే డే ను విజయవంతం చేయాలని తెలంగాణ మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాతాకుల మధుబాబు కోరారు. గురువారం పాత ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ అనుబంధ సంస్థ అయిన భారత రాష్ట్ర సమితి కార్మిక విభాగం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నయీం, శేషు వెంటేశ్వర్లు, భూతం శ్రీను, అబ్దుల్, కాంతారావు, విజయ్, విజయలక్ష్మి, అరుణ, కళమ్మ, శైలజ, వరమ్మ పాల్గొన్నారు.

నేరేడుచర్ల : ప్రపంచ కార్మిక దినోత్సవం మే డేను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు అన్నారు. గురువారం ఆయన నేరేడుచర్లలో సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘం భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేష్, సీఐటీయూ మండల కన్వీనర్ రామ్మూర్తి, యారవ శ్రీను, తిరుపతయ్య, సత్తార్, రవీందర్, భిక్షం, నాగరాజు, నాగుల్‌మీరా, శ్రీను, ఖాజావలి, సాయబ్, సైదులు, నాగమ్మ, రామకృష్ణ ఉన్నారు.

హుజూర్‌నగర్ : ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే వేడుకలను విజయవంతం చేయాలని టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి కోరారు. గురువారం పట్టణంలోని నిర్వహించిన మున్సిపల్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడే ప్రపంచ కార్మికుల పండుగ అని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు ముత్తమ్మ, దుర్గారావు, సైదులు, రవి కుమార్, పద్మ, కోటమ్మ, రామయ్య, దేవకర్ణ, వెంకన్న, చంద్రకళ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే సైదిరెడ్డి



మంత్రి కేటీఆర్‌తో ఎమ్మెల్యేలు సైదిరెడ్డి, మల్లయ్యయాదవ్, లింగయ్య

హుజూర్‌నగర్ : రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి గురువారం హైదరాబాద్‌లో కలిశారు. బీఆర్ఎస్ ప్రతినిధులు సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే అనంతరం మంత్రిని కలిసి హుజూర్‌నగర్ నియోజక అభివృద్ధికి సంబంధించిన పలు విషయాలు ఆయనతో చర్చించారు. ఆయన వెంట ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్య యాదవ్, చిరుమర్తి లింగయ్య ఉన్నారు.

దాతల సహకారం అభినందనీయం



పట్టణ పోలీస్ స్టేషన్‌లో వాటర్ ప్యూరిఫయర్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి

కోదాడ రూరల్ : దాతల సహకారం అభినందనీయమని కోదాడ డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ మహేశ్వరరెడ్డి అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని పట్టణ పోలీస్ స్టేషన్‌లో శ్రీ కృష్ణ వాటర్ యాజమాన్యం సహకరంతో రూ.50 వేల విలువైన వాటర్ ఫ్యూరిఫయర్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ ఆంజనేయులు, రూరల్ ఎస్ఐ నాగదుర్గ ప్రసాద్, పట్టణ ఎస్ఐలు రామాంజనేయులు, సాయి ప్రశాంత్, సంస్థ ఎండీ యలమర్తి వంశీకృష్ణారెడ్డి, డైరెక్టర్ ఓరుగంటి సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

నృసింహుడి కల్యాణోత్సవాలను జయప్రదం చేయాలి



మట్టపల్లి క్షేత్రంలో పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ వెంకారెడ్డి, తదితరులు

మఠంపల్లి : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో మే 3 నుంచి 6 వరకు జరగబోయే కల్యాణ మహోత్సవాలను విజయవంతం చేయాలని హుజూర్‌నగర్ ఆర్డీఓ వెంకారెడ్డి కోరారు. గురువారం మట్టపల్లిలో దేవాలయ పరిసరాలు, కృష్ణానది, వివిధ కులాల అన్నదాన సత్రాలు, వాహనాల పార్కింగ్ స్థలాన్ని వివిధ శాఖల అధికారులు దేవస్థాన పాలకవర్గంతో కలిసి పరిశీలించి మాట్లాడారు. కల్యాణ మహోత్సవాల విజయవంతానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, పరిశ్రమల యాజమాన్యాలు ప్రత్యేక కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, చెన్నూరు మట్టపల్లిరావు, మాజీ ఎంపీటీసీ వెంకటరమణ, ఎస్ఐ ఇరుగు రవి, అధికారులు, అన్నదాన సత్ర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

తిరుమలగిరి (తుంగతుర్తి) : మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని మండల ఎస్ఐ బి.శివకుమార్ హెచ్చరించారు. గురువారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ఆయన వెంట ఏఎస్ఐ జగన్మోహన్‌రెడ్డి, సిబ్బంది సైదులు ఉన్నారు.

బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నాం

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : పట్టణ పరిధిలోని వజ్రా టౌన్‌షిప్‌కు మూసీ కెనాల్‌కు మధ్యలో ఉన్న రోడ్డులోని కొంత భాగాన్ని వట్టే జానయ్య ఆక్రమించి అక్రమ కట్టడం చేస్తున్నది నిజమని, ఆక్రమణలపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి వీరేంద్ర, పార్లమెంట్ కో కన్వీనర్ తుక్కని మన్మథరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చల్లమల్ల నరసింహ, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు వల్దాసు ఉపేందర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. భూమిని ఆక్రమించారని ప్రశ్నిస్తే సబ్జెక్టు గురించి మాట్లాడకుండా మా నాయకుడు సంకినేని వెంకటేశ్వర్‌రావుపై అసభ్య పదజాలంతో వ్యక్తిగత విమర్శలు చేయడం తగదన్నారు. టౌన్‌షిప్ అక్రమాలపై టౌన్‌షిప్‌కు భూమి అమ్మిన వారి సమక్షంలో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. జిల్లా అధికార ప్రతినిధి పలస మల్సూర్‌గౌడ్, కోశాధికారి పగిళ్ల సూసిందర్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి అరూరీ శివ, జిల్లా నాయకులు దాసరి వెంకన్న యాదవ్ ఉన్నారు.